# ఎదిగిన మనసు

గదిలో పడకకుర్చీలో కూర్చున్నాడు సతీష్. కాలుస్తున్న సిగరెట్టుపొగ రింగురింగులుగా పైకిపోతోంది. కళ్ళు పొగనే చూస్తున్న అతని మనస్సు ఎక్కడో ఉంది. మాలతిని పుట్టింటికి పంపించింది మొదలు ఏదో తెలియనిబాధ అతన్ని చుట్టుకుంది. మూడురోజులనుంచి ఆఫీసుకి వెళ్ళలేదు.

బిందెలో నీళ్ళు ముంచుకుని తాగడంకూడా అతనికి అల వాటులేదు. అడగకుండానె కాఫీ పట్టుకొచ్చేది. తనబట్టలు ఎక్క డున్నాయో కూడా తనకి తెలీదు. మనిషి ఎదురుగా ఉంటే తెలి యని ప్రాధాన్యత ఆమె లేనప్పుడు స్పష్టంగా కనబడుతోంది.

కాని అతని అంతరాత్మ ఆవిషయం పూర్తిగా అంగీకరించ లేకపోతోంది. అంతలోనె మాలతిమీద చెప్పలేని కోపం వచ్చింది. "ఛీ! ఛీ" ఆమె తనను మోసంచేసింది. తన ప్రేమను నలిపి వేసింది. ఆమెను తలచుకుంటేనె పాపం వస్తుంది. బాధగా కళ్ళు మూసుకున్నాడు. గతమంతా కళ్ళముందు మెదిలింది.

ఆరోజు సతీష్ స్నేహితుల్ని టీకి పిలిచానని చెప్పాడు. మాలతికి ఎంతోసంతోషంగా డ్రాయింగ్ రూము సద్దింది. జీడి పప్పుతో పకోడీలు, రసగుల్లాలు తయారుచేసింది. తాను స్నానం చేసి అలమారులో చీరతీసి కట్టింది. అద్దంముందు నిలబడి బొట్టు, కాటుక పెట్టుకుంటోంది.

"మాలతీ అంతా రెడీచేశావా?" లోపలికి వస్తూనెఅడిగాడు సతీష్.

"అంతా రెడీ! మీ ఫ్రెండ్సు రావడమే ఆలస్యం.

అందంగా మెరిసిపోతున్న భార్యవైపు చూసాడు. తనభార్య దేవకన్యలా ఉంటుందంటారు అంతా. ఈరోజు అప్సరసలా ఉంది తనస్నేహితులు ఆమెనుచూసి తన అదృష్టానికి ఈర్ష్యపడాలి." అనుకున్నాడు మనస్సులో.

"ఏమిటండీ మరీ అలా చూస్తున్నారు?"

"నిన్ను చూడకపోతే మరెవర్ని చూస్తా మాలతీ" ఎక్కడ అతి సుకుమారమైన బుగ్గలు కందిపోతాయో అనుకున్నట్లుగా ఆ బుగ్గలమీద చిటికవేశాడు సతీష్.

సంతోషంలో మెలికలు తిరిగింది మాలతి.

"మాలతీ! నా మాలతీ" అంటూ ఆమెను ఒక్కసారి తన గుండెలకు హత్తుకున్నాడు. అప్పటికి అతనిదృష్టి ఆమెకట్టుకున్న చీరమీద కెళ్ళింది.

"మాలతీ నా స్నేహితులు వస్తుంటే ఇంత పల్చనిచీర కట్టుకున్నావేమిటి? వాళ్లు ఏమనుకుంటారుచెప్పు?"

"ఈఆర్గండీచీరలు ఇలా పల్చగానె ఉంటాయండి. మీరేకదా కొనిచ్చారు. మొన్న కట్టుకుంటే చాలాబాగుందని మీరేగాఅన్నారు. అందుకే మళ్ళా కట్టుకున్నానండి. చాలా గ్రాండుగా కనబడాలని మీరేగా అన్నారు. పోనీ ఇంకోచీర కట్టుకోమంటారా?"

అతనిమనస్సు కష్టపెట్టడం మాలతికి ఇష్టముండదు. అతనికి నచ్చినట్లే ప్రవర్తిస్తుంది.

నిజంగా తెలీకే కట్టుకున్నట్లుంది అనుకుని మనస్సులో

"పమిట కాస్త భుజాలమీదుగా కప్పుకుంటేసరి. నేనుసంజ్ఞ చేసినట్లుగా మసలుకో" అన్నాడు సతీష్. ఆచీర తనకోసమే కట్టుకుందని సరిపెట్టుకున్నాడు.

"అలాగేనండి. దానికేం భాగ్యం" అంది సంతోషంగా.

"వాళ్ళు కూర్చోమని కబుర్లు ప్రారంభిస్తారు. నువ్వు మాత్రం అలాచెయ్యకుసుమా"

"అలాగెనండి. మీరిన్నిసార్లు చెప్పాలా. ఆ మొగవాళ్ళ పక్కని కూర్చుని కబుర్లుచెప్పడం నాకూ ఇష్టముండదండీ" అంది నవ్వుతూ.

"హమ్మయ్య" అనుకున్నాడు గుండెలమీద చేయివేసుకుని.

ఇంతలో కాలింగ్‌బెల్లు మోగింది. సతీష్ వెళ్ళి తలుపు తీశాడు. వచ్చిన ముగ్గురు స్నేహితుల్ని ఆహ్వానించి కుర్చీలో కూర్చోపెట్టాడు. మంచినీళ్ల గ్లాసులు అందించాడు. తర్వాత భార్యను పిలిచాడు బంగారుబొమ్మలా ఉన్న మాలతి పమిట భుజాలమీదుగా కప్పుకొని వచ్చింది.

సతీష్ అందరికి పరిచయంచేశాడు. మాలతి అందరికి చిరునవ్వుతో నమస్కరించింది.

"మీరుకూడా కూర్చోండి" అన్నాడు రాజేష్.

సతీష్ తనపక్కనేఉన్న కుర్చీ చూపించాడు.

మాలతి కూర్చోలేదు. పైగా ఇప్పుడే వస్తానండి అంటూనె వంటింట్లోకి నడిచింది.

నేను చెప్పినమాటలు మరింత బాగా అమలుపరిచింది అనుకున్నాడు సంతోషంగా సతీష్.

భార్యతోపాటు వంటింట్లోకి వెళ్ళాడు. మాలతి జీడిపప్పు పకోడీలు, మషాలాగార్లు, పాలకోవాలు ప్లేట్లలోపెట్టి ట్రేలో అమర్చింది. ఆవిడ చేతులోనుంచి సతీష్ అందుకున్నాడు. ముగ్గురికి మూడు ప్లేట్లుఅందించాడు. తానుకూడా ఒకప్లేటు తీసుకున్నాడు. మాలతి అందరికి మంచినీళ్ళగ్లాసులు టీపాయ్‌మీద పెట్టింది. సతీష్ కళ్ళు ఆవిడమీదేఉన్నాయి. ఈసారి ఏంచేస్తుదా అనుకున్నాడు. ఇవేమీ పట్టించుకోని మాలతి వంటింట్లోకి నడిచింది. స్నేహితులు ముగ్గురికళ్ల మాలతిమీదేఉన్నాయి. గర్వంగా భుజాలు ఎగరవేశాడు సతీష్.

“సతీష్ ఏంబాగున్నాయ్ పకోడీలు, రసగుల్లాలు కూడా చాలా రుచిగాఉన్నాయి. ఇవన్నీ మీఆవిడే తయారుచేసిందా? భార్యనుగూర్చి గొప్పగా చెప్పుకోడానికి సమయం వచ్చిందనుకున్నాడు. “అవును. అన్నీ మా ఆవిడేచేసింది. ఆవిడ ఇల్లు శ్రద్ధగా సద్దుకుంటుంది. వంటకూడా ఎంతో శ్రద్ధగా చేస్తుంది” అన్నాడు గర్వంగా.

“అలాగా ఆవిడ రూపంలాగె పదార్థాలుకూడా ఉన్నాయి” అన్నారు ముగ్గురు

వక్కపొడిడబ్బా పక్కనపెట్టింది.

వద్దంటూనే అందరూ వక్కపొడి తీసుకున్నారు. వాళ్లు వెళ్ళిపోతుంటె భార్యను పిలిచాడు. “మీచేతివంట అద్భుతమండీ”

"ఏదోలెండి" అంది నసుగుతూ పమిటకొంగు నిండుగా కప్పుకుని అందరికి ప్రతినమస్కారాలు చేసింది. సతీష్ సంతోషానికి అవధుల్లేవు. తనభార్యప్రవర్తన అతనికి నచ్చింది.

నిజంగా తనభార్య మహాపతివ్రత. తను కూర్చోమన్నా లోపలికి వెళ్ళిపోయింది. తను చెప్పినట్టుగానె పమిట నిండుగా కప్పుకుంది. భార్యఅంటే ఇలాఉండాలి' అనుకున్నాడు.

స్నేహితులతో కలిసి తనుకూడా బయటకు నడిచాడు. రోడ్డుచివరవరకు వెళ్ళి సాగనంపి బజారువైపు నడిచాడు. అక్కడ పూలు రాసులుగాపోసి అమ్ముతున్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు "పుష్పమాలికలు శ్రీవా" పూలను పూబోణులు అమ్మితేనే అందమన్నారు. అయినా ఈరోజుల్లో ఆడ, మగా లేదు అందరూ పూలమ్మేవారే. ఏమైన తను పూబోణులదగ్గరే కొనాలి. అనుకుంటూనె "ఓఅమ్మా! సన్నజాజిమాల ఎలా అమ్ముతున్నావు.

"అరనా మూర బాబూ" అంది.

"నలభై పైసలకియ్యి"

"రాదుబాబూ కొన్నధరే కిట్టుబాటుకాదు"

"సరే రెండుమాలలియ్యి" అన్నాడు. మాలతి జడ మోకాళ్ళుదిగి ఉంటుంది. అంతజడలో కనీసం రెండు మూరల పూలేనా పెట్టుకుంటే బాగుంటుంది" అనుకున్నాడు.

ఈపువ్వులు తానే స్వయంగా మాలతిజడలోపెట్టాలి ఆమె అందంగా తనఒడిలో వాలిపోతుంది. తన బాహువులలో ఆమెను బంధించి ఉక్కిరిబిక్కిరిచెయ్యాలి అనుకుంటూ నుంచున్నాడు.

పూలుకొలిచి ఆమె పొట్లం కడుతోంది.

అంతలో తనతోపనిచేసే మేరీ కలిసింది.

"పూలు కొంటున్నారా" అంది నవ్వుతూ.

"అవును మామాలతికి. మీరుకూడా తీసుకుంటారా?"

"నాకు తలలో పూలుపెట్టుకోడం ఇష్టముండదండీ" అంది నవ్వుతూ.

"అయితే మీకు డబ్బంతా మిగులే" అన్నాడు నవ్వుతూ.

మేరీకూడా పకపక నవ్వింది.

అంతలో దూరంనుంచిపోయె మోటారుసైకిలు కనబడింది. తనస్నేహితుడు మోహన్ అనుకున్నాడు గుర్తుపట్టి, అతనిపక్కనే ఎవరోస్త్రీ పరిశీలించి చూశాడు. సందేహంలేదు తనభార్య మాలతి. అదే ఆర్గండీచీరలో, అతనిమనస్సు అదుపుతప్పింది. ఒళ్ళుచమట్లు పట్టాయి. నోరెండిపోయింది. తల గిర్రున తిరిగినట్లయింది.

'వస్తానండి' అన్న మేరీ మాటలు వినబడలేదు. ఆమె వెళ్ళడంకూడా అతనికి తెలియలేదు.

దగా, మోసం, కుట్ర. ఎంతపనిచేసింది. తనఎదుట మహా పతివ్రతలా కనబడింది. తనజీవితం నాశనంచేసింది. కోపం పట్ట పగ్గాలులేకుండా వచ్చింది. మోటారుసైకిలు కనబడకుండా వెళ్ళి పోయింది. ఇంటికివెళ్ళి చావకొట్టాలనుకున్నాడు. మళ్ళీ అంతలోనె 'ఛీ! ఛీ!' ఆమెను తలుచుకుంటేనె పాపమొస్తుంది అనుకున్నాడు.

చేతిలోఉన్న పూలపొట్లం విప్పి దూరంగా పడేశాడు. తర్వాత పక్కనేఉన్న ఒకహోటల్లో కూర్చున్నాడు.

సిగరెట్లడబ్బాలు రెండు పూర్తయ్యాయి. అప్పటికి ఒక నిర్ణయానికి వచ్చాడు.

వెంటనే మామగారికి ఒక టెలిగ్రాం ఇచ్చాడు. అందులో వెంటనేవచ్చి తనభార్యను తీసుకుపొమ్మనిఇచ్చాడు. తర్వాత రెండవ ఆట సినిమాకు వెళ్ళాడు. టికెట్టుకొని కూర్చున్నాడు. అక్కడ కూడా అతనికేమీతోచలేదు. అలా రోడ్లన్నీ తిరిగి తిరిగి రాత్రి 1 గంటకు ఇల్లు చేరుకున్నాడు. ఇంటికి అసలు వెళ్ళాలని లేదు. పార్కులో రాత్రివేళ ఉండనివ్వరు. పైగా హోటల్లో కూర్చోనివ్వరుకూడా. ఇంక తప్పక ఇల్లుచేరుకున్నాడు.

తలుపుకొట్టగానె మాలతి తలుపుతీసింది. సోఫాలో చతికిలబడ్డాడు. కాలి బూట్లు, కాలి చెప్పులు కాని ఆమెకు తియ్యడం అలవాటు. అతను ఆమెనుచూసి 'వద్దు'అన్నట్టుగా కాళ్ళుముడుచుకున్నాడు. తర్వాత పడకగదిలోకివెళ్ళి చెప్పులు వదిలాడు. బట్టలు మార్చుకోకుండానె మంచంమీద పడ్డాడు.

మాలతికి చాలా ఆశ్చర్యమేసింది.

"భోజనం చేస్తారా వడ్డించనా" ఎంతో వినయంగా అడిగింది. ఆకలిలేదు. తినొచ్చాను. ఆట్టే నన్ను విసిగించక పోయి పడుకో" కసురుకున్నాడు.

ఆమాటలు ఆమెకు కొత్తగా అనిపించాయి. వెంటనే వెళ్ళి మరో గదికి పోయి పడుకుంది.

తెల్లారకుండానె మామగారు దిగారు. సతీష్ ఇంకా నిద్ర లేవలేదు.

"అదేమిటి నాన్న చెప్పకుండా వచ్చారు?" ఆశ్చర్యంగా అడిగింది మాలతి.

"సతీష్ వెంటనే రమ్మని టెలిగ్రాం ఇచ్చాడు. నీకు తెలీదా?"

"నాకుతెలీదు నాన్నా! ఇప్పుడు చెబుతారేమో" అంది.

ఈసంభాషణవిన్న సతీష్ లేచివచ్చాడు. గబగబా ముఖం కడుక్కొని కాఫీగ్లాసు అందుకున్నాడు. ఏమీ తెలీనట్లు మామగారి పక్కనచేరాడు.

ఆయన సామాన్యుడుకాడు. ఆవలిస్తే పేగులు లెక్కపెడ తాడు. అందుకే చాలాజాగ్రత్తగా నాటకమాడాలనుకున్నాడు. మామ గారు అడగకుండానె చెప్పడం ప్రారంభించాడు.

"నాకు హఠాత్తుగా ఒక నెలరోజులు మద్రాసు కాంపు పడింది. ఈరోజే బయలుదేరాలి. మీరు మాలతిని తీసుకు వెడతా రని టెలిగ్రాం ఇచ్చాను".

"మద్రాసు కాంపుఅయితే టెలిగ్రాం ఎందుకయ్యా? మద్రాసులో మాచెల్లెలుంది. మాలతి, నువ్వువెడితే వాళ్లు నెత్తిమీద పెట్టుకుంటారు. మీరు వస్తున్నట్టు టెలిగ్రాం ఇస్తానయ్యా"

"అబ్బే వాళ్ళింట్లో ఉండడం ఎలా కుదురుతుందండీ. నేను ఎక్కడెక్కడో తిరగవలసి ఉంటుంది. మరోసారి వెళ్ళచ్చులెండి"

ఇంక మరేమి సమాధానం చెప్పడానికి వీలులేకుండా అక్కడనుంచి కదిలాడు సతీష్.

"అమ్మాయి మాలతీ సామాను సర్దుకోమ్మా. ఈ పూటే మనం బయలుదేరుదాం" అన్నాడు కూతురుతో.

ఒకపక్క వంటచేస్తూనె మాలతి సామాను సర్దడం ప్రారంభించింది.

మరోపక్క సతీష్ తన సూటుకేసు తీసుకుని సామాను సర్దుకోడం మొదలుపెట్టాడు.

అదేమిటండీ! మీరు సర్దుకుంటున్నారు. నేను సర్దుతానుండండి" మాలతి అతని పెట్టెదగ్గరకువెళ్ళి సర్దబోయింది.

"నీపని నువ్వుచూసుకో. నేసర్దుకోడానికేముంది" అంటూనె రెండుజతలబట్టలు పెట్టుకొని తాళం పెట్టేశాడు. రాత్రినుంచి అతని చేష్టలు మామూలుగాలేవని ఇట్టేగ్రహించింది. కాని అతను మాట్లాడటానికి అవకాశం ఇవ్వడంలేదు. ఒకవేళ తనని వదలి ఉండలేక అలా ముభావంగా ఉన్నాడనుకుని సరిపెట్టుకుంది మాలతి.

భోజనాలుచేసి బయలుదేరింది తండ్రితో మాలతి. వెళ్ళేముందు "టా!టా!" అన్నాడు సతీష్. స్టేషనుకుకూడా వెళ్ళలేదు. వాళ్లువెళ్ళినతరువాత గట్టిగా ఊపిరితీసుకున్నాడు. ఎంతో చక్కగా నటించానని మురిసిపోయాడు.

సర్దుకున్న పెట్టె మంచంకిందకు తోసివేశాడు.

ఆఫీసుకు వెళ్ళాలనిపించలేదు. తలుపులు గడియపెట్టుకుని మంచంమీద పడుకున్నాడు.

మెలకువ వచ్చేటప్పటికి సాయంకాలమయింది. లేవగానె టీ తాగడం అలవాటు. ఇంటికి తాళం పెట్టుకుని బయటకెళ్ళి టీ తాగివచ్చి కూర్చున్నాడు. మాలతివెళ్ళిందిమొదలు మనసులో ఏదో నిరుత్సాహం ప్రారంభమైంది. ఎంత మరచిపోదామన్న ఆమె కళ్ళ ముందు కదులుతోంది. మరోపక్క ఆమెమీద ద్వేషం, పగ. ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. సిగరెట్లమీద సిగరెట్టు కాలుస్తు న్నాడు.

మూడురోజులనుంచి మాసినగడ్డంతో అలాగె ఉన్నాడు. ఇంతలో "ఏమండీ! ఏమండీ!" అన్న పిలుపుతో వర్తమానంలోకి వచ్చాడు సతీష్. కుర్చీలోనుంచి నీరసంగా లేచి తలుపు తీశాడు. ఎదురుగా మోహన్‌భార్య రేఖ శోకదేవతలా నిలబడిఉంది.

"ఏమండీ! ఆయన కడుపులో నెప్పితో మెలికలు తిరిగి పోతున్నారు. మీరు అర్జంటుగా రావాలండీ" ఏడుస్తూనె చెప్పింది.

"ఎప్పటినుంచండీ"

"రాత్రినుంచి కొంచెం నెప్పిగాఉందండి. పక్క డాక్టరు ఏవో మందులిచ్చాడు. ఒకగంటనుంచి ఎక్కువైపోయింది" వెక్కిళ్ళమధ్యలో మాటలు తడబడ్డాయి.

"ఇప్పుడే వస్తున్నానుండండి" అంటూనె లుంగీ విప్పి పాంటువేసుకుని గదికి తాళంపెట్టాడు.

అతను బయలుదేరడంచూసిన రేఖ తిరిగి వెళ్ళబోయింది.

"మీరు ఉండండి" అంటూనె స్కూటర్ స్టార్టు చేశాడు సతీష్.

"అక్కరలేదండీ! దగ్గరేగా నేను నడిచివస్తానండీ"

"ఈకంగారులో ఏంనడుస్తారండీ! రండి స్కూటరెక్కండి"

స్కూటరు స్టార్టుచేశాడు. రేఖవచ్చి వెనకసీట్లో కూర్చుంది.

రెండునిమిషాల్లో పక్కవీధిలోఉన్న శేఖర్ ఇంటిముందు స్కూటర్ ఆపాడు.

రేఖకంటెముందు ఇంట్లోకి పరుగెత్తాడు. శేఖర్ బాధతో మెలికలు తిరిగిపోతున్నాడు.

వెంటనే టాక్సిపిలిచి శేఖర్ని నర్సింగ్‌హోమ్‌లో ఎడ్మిట్ చేసాడు.

శేఖర్‌కి ఎపిండిసైటిస్ ఆపరేషన్‌చేసారు. రెండురోజులకు కాని శేఖర్ మామూలుస్థితికిరాలేదు. ఆ రెండు రోజులు శేఖర్ భార్యను తన స్కూటర్‌మీద ఎన్నోసార్లు హాస్పిటల్‌నుంచి ఇంటికి ఇంటినుంచి హాస్పిటల్‌కి తీసుకువెళ్ళవలసివచ్చింది.

కాస్త కోలుకున్న శేఖర్ "సతీష్ మీభార్యాభర్తల ఋణం ఈజన్మలో తీర్చుకోలేనురా" అన్నాడు అంత నీరసంగా ఉన్న ఆ కళ్ళలో ఆత్మీయత కొట్టవచ్చినట్లు కనబడింది.

"ఒకరికొకరు సహాయం చేసుకోకపోతే ఎట్లా! ఈమాత్రం దానికి అంతగా పొగడకురా"

"అదికాదు సతీష్! నీపనులన్నీ మానుకుని రేఖను ఎన్నో సార్లు స్కూటర్‌మీద అటుఇటు తీసుకువచ్చావని, ఎంతోసహాయం చేసావని చెప్పింది.

అదేమిటి ఇవన్నీ కూడా శేఖర్‌కి చెప్పిందా! అతను ఏమీ అనుకోలేదా! పైగా ఎంతో గొప్పగా పొగుడుతున్నాడు.

అప్పుడు అతని మనస్సులో ఏదో మథనం ప్రారంభ మయింది. తాను స్కూటర్‌మీద రేఖను కూర్చోపెట్టుకుంటే ఏమనిపించిది. జ్ఞాపకం చేసుకున్నాడు. ఆకంగారులో ఏమీ అని పించలేదు. కన్నతల్లిని, లేక సొంతచెల్లెల్ని కూర్చోపెట్టుకున్నట్లే అనిపించింది. మరి తన భార్య శేఖర్ స్కూటర్‌మీద కూడా ఇంతేనా?"

"సతీష్ నువ్వు చాలా అదృష్టవంతుడివిరా! అంత మంచి గుణవంతురాలిని భార్యగాపొందావు. ఆరోజు రేఖ కళ్లుతిరిగి పడి పోయింది నాకు ఏంచెయ్యడానికి తోచక మీఇంటికెళ్ళాను. నువ్వు పదినిమిషాల్లో వస్తావనిచెప్పింది మాలతి. నా కంగారులో ఆమెను తొందర పెట్టాను.

"వారువచ్చాక మేమిద్దరం వస్తాముండిఅంది" పాపం నేనే కంగారుపెట్టి బలవంతంగా నా మోటార్‌సైకిలెక్కించి తీసుకు వచ్చాను. నాభార్యకు ఎంతో సేపు సపర్యలు చేసింది. ఆమె లేక పోతే మేము ఎంత ఇబ్బందిపడేవాళ్ళమో తెలుసా! నేను నా వెహికిల్‌మీద దిగబెడతానన్నా వినిపించుకోకుండా రిక్షామీదఇంటికి వెళ్ళిపోయింది. మీదంపతులిద్దరికి ఋణపడి ఉన్నాం"

సిగ్గుతో వంచిన తల ఎత్తలేకపోయాడు సతీష్. అతని మనస్సుకు జ్ఞానోదయమై ఎంతో ఎదిగినట్లయింది. పశ్చాత్తాపంతో దహించుకుపోయాడు. 'మాలతీ' అంటూ బస్సుస్టాండువైపు పరుగెత్తాడు.

అర్ధరాత్రివచ్చిన అల్లుణ్ణిచూసి ఆశ్చర్యపోయారుమామగారు "కాంపు అప్పుడే అయిపోయిందా" అడిగారు ఆయన.

'అవునండీ' అంటూనె మాలతిఉన్న గదిలోకి పరుగెత్తాడు. చేతిలోఉన్న పూలపొట్లంవిప్పి ఆమెజడలో తురిమాడు.

"ఇంకెప్పుడు నువ్వులేకుండా కాంపుకి వెళ్ళను మాలతీ" అంటూనె కౌగిట్లో బంధించాడు. అందుకోసమే ఎదురు చూస్తు న్నట్లుగా అతని ఎదలో ఒరిగిపోయింది మాలతి.

ఎంతో ఎదిగిన అతని మనస్సు నిర్మలమైన ప్రేమతో తొణికిసలాడింది.